నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 10 మార్చి 2025 | ADILABAD NIRMAL




గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద పుస్పూర్‌లో నీరందక ఎండిన వరి పైరు

- గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- ప్రధాన కాలువకు కేవలం 80 క్యూసెక్కుల నీటి విడుదల
- తూముల కంటే దిగువన నీటి ప్రవాహం
- మోటార్లు పెట్టుకున్నా అందని తడవని మడి
- అయోమయంలో అన్నదాతలు.. నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్

# తడికి తండ్లాట

## ఎండుతున్న పంటలు.. చి'వరి'కి అందని నీరు

### మళ్లీ పాత కాలం రోజులు అచ్చినయ్...



గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువను నమ్ముకుని వరి వేస్తే రెండెకరాలు ఎండింది. నోటికి అచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతున్నది. నీళ్ల లేక రెండెకరాలు ఇడిసిపెట్టి, పొట్ట కోసం ఒక ఎకరం పొలాన్ని అయినా కాపాడుకుందామని నానా తంటాలు పడుతున్న. ఎకరానికి రూ.5 వేలు కిరాయి ఇచ్చి మోటరు తెచ్చుకుని నీళ్ల పారించుకుంటున్న. రోజుకు పది సార్లు కరెంటు బంద్ అయితున్నది. అర్ధరాత్రి ఒంటి గంటకు కరెంటు ఇస్తున్నరు. మళ్లీ పాతకాలం లెక్క రోజులు అచ్చినయ్. నీళ్ల కోసం పొలం కాడనే పడుకుంటున్న. నాకు పుస్పూర్ శివారంల ఉన్న మూడెకరాల పొలంల వరి వేసిన. కెనాల్ కింద నీళ్ల అందకుంటే కాల్వ పొంట మోటర్లు పెట్టుకుని నీళ్ల పారించుకొమ్మని ఆఫీసర్లు చెప్పిన్రు. ఇప్పుడేమో నీళ్ల లేవని మోటర్లు పెట్టనిస్తలేరు. రాత్రి పూట అచ్చి బందు చేస్తున్నరు. కెనాల్ పొంటనే భూమి ఉన్నప్పటికీ నీళ్ల అందుతలేవు. కాలువల నీళ్ల జానెడు మట్టం కూడా అస్తలేవు. తూములు మీదికైనయ్. నీళ్ల కిందికి అయినయ్. కేసీఆర్ ఉన్నప్పుడు కాలువ పుల్లు పారుతుండే. పొలాలు పారంగా ఇంకా మిగిలిన నీళ్లతో చెరువుల నిండుతుండే. తూముల నుంచే పొలాలు పారుతుండే. ఇప్పుడు మోటర్లు పెట్టినా అందుతలేవు. ఈ గవర్నమెంట్ అచ్చిన సంది రైతులకు చాన తిప్పలైతున్నది. రుణమాఫీ బరాబర్ కాలే. రైతుబంధు రాలే. రైతుల బతుకు తువ్వాల అడ్డం పెట్టుకుని ఏడుసుడుకు అచ్చింది. ఇంత అందేర్ అయితదని అనుకోలే.

**- పర్స పోతన్న, రైతు, పుస్పూర్, లోకేశ్వరం మండలం.**

నిర్మల్, మార్చి 9(నమస్తే తెలంగాణ) : గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. పాలకుల పట్టింపు లేనితనం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదు. భైంసా పట్టణ శివారులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా భైంసా, లోకేశ్వరం మండలాల్లోని దాదాపు 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉన్నది. 2005 సంవత్సరంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినప్పటికీ, కాలువల నిర్మాణం జరగకపోవడంతో ఆయా మండలాల్లోని భూములు ఏళ్లుగా సాగు నీటికి నోచుకోలేదు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో ఈ ప్రాజెక్టు కింద ప్రధాన కాలువ నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ రూ.6 కోట్లు విడుదల చేశారు. దీంతో దాదాపు 20 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం భైంసా నుంచి పుస్పూర్, బిలోలి గ్రామాల వరకు కాలువ ద్వారా సాగు నీరు అందుతున్నది. మరో 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందు కోసం గతేడాది కాలంగా నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. దీంతో ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదు.

**కేవలం 80 క్యూసెక్కులే..**

గడ్డెన్న వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా రోజుకు కేవలం 80 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తుండడంతో కాలువ కింద సాగు చేస్తున్న పంటలకు నీరు సరిపోవడం లేదు. వాస్తవానికి ఈ కాలువ ద్వారా 14 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం ఎనిమిది వేల ఎకరాలకు కూడా సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన చాలామంది రైతులు

**కాంగ్రెస్ తెచ్చిన కరువు**

ఈ కాలువ నీటినే నమ్ముకుని యాసంగిలో వరి, మక్క సాగు చేశారు. అయితే అతి తక్కువ నీటిని వదులుతుండడంతో కనీసం తూముల మట్టం కూడా నీరు ప్రవహించడం లేదు. దీంతో ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి మోటార్లను ఏర్పాటు చేసుకుని కాలువలో ఉన్న అరకొర నీటిని తోడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి కూడా అధికారులు అడ్డంకులు సృష్టిస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లను నీటిపారుదల శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ వైర్లను కట్ చేసి తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి రైతుభరోసా సాయం అందకున్నా.. అప్పులు చేసి సాగు చేసిన పంటలు తమ కళ్ల ముందే ఎండుతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒకవైపు కరెంటు కోతలు, మరోవైపు సాగునీటి తిప్పలతో మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పాలన రోజులు గుర్తుకు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి కష్టాలు ఎన్నడూ చూడలేదని, ఈ కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయని పుస్పూర్‌కు చెందిన రైతులు పర్స పోతన్న, భూషన్‌రెడ్డిలు 'నమస్తే' ప్రతినిధితో వాపోయారు. ఒక చేతిలో కట్టె, మరో చేతిలో టార్చిలైట్ పట్టుకుని అర్ధరాత్రి తమ పొలాలకు నీళ్లు పారియతందుకు వెళ్తున్నామని, ఈ కష్టం పగోడికి కూడా రావొద్దని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



లోకేశ్వరం మండలం పుస్పూర్‌లో ఎండిపోయిన మక్కపంటను చూపుతున్న రైతు భూషన్‌రెడ్డి

### కాలువల నీళ్లే లేవు..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద మెయిన్ కెనాల్‌కు సరిగ్గా నీళ్లిస్తలేరు. ఉన్న కొన్ని నీళ్లను మోటార్లు పెట్టి పంటలను కాపాడుకుందామంటే అధికారులు సహకరిస్తలేరు. కాలువ మీద పని చేసెటోళ్లు అచ్చి మోటర్లు బంద్ చేస్తున్నరు. కరెంటు వైర్లు కట్ చేస్తున్నరు. కరెంటు కూడా సక్కగ ఉంటలేదు. ఎప్పుడు అస్తదో ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. వరి, మక్క పంటలు ఎండిపోతున్నయ్. కాలువ పక్కనే నాకు భూమి ఉన్నది. మా కోసమే తూము ఉన్నప్పటికీ.. తూము లెవల్ కూడా నీళ్లు వదలడం లేదు. మోటర్లు పెట్టి పారిద్దమంటే కాలువల కనీస మట్టం కూడా నీళ్లుంటలేవు. కాలువ మీదనే ఆధారపడి పంటలు ఏసినం. కేసీఆర్ హయాంలనే కాలువలు తవ్విండ్రు. నాలుగేండ్ల సంది ఏ ఇబ్బంది లేకుండే. ఈ సంవత్సరమే నీళ్లు లేక పంటలన్నీ ఎండిపోతున్నయ్. రెండెకరాల్లో వరి, రెండెకరాల్లో మక్క పంట వేసిన. వరి మొత్తం ఎండింది. ఎకరానికి 20 వేల చొప్పున పెట్టుబడి ఖర్చులైనయ్. రెండెకరాలకు 40 వేల పెట్టుబడి ఖర్చులు నష్టపోయిన. రైతులకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదు. కనీసం ఎండిన పంటలను సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

**- కోనాజి భూషన్‌రెడ్డి, రైతు, పుస్పూర్, లోకేశ్వరం మండలం**



కాలువలో తూముకు దిగువన తక్కువ మట్టంతో పారుతున్న నీరు



## జిల్లాకు పాకిస్థాన్, బంగ్లాదేశ్ అతిథులు..

దస్తురాబాద్ మండల కేంద్రంలోని కుంటలో ఉన్న అటవీ జాతి బాతులు

*నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలానికి యేటా పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి అరుదైన అటవీ జాతి బాతులు అతిథులుగా వస్తుంటాయి. ప్రతి వేసవికి వచ్చి వేసవి ముగిసిన తర్వాత వెళ్తాయి. ఇండియన్ విజిలింగ్ బాతు(లెస్సర్ విజిలింగ్ టీల్)గా పిలవబడే ఈ బాతులు దాదాపు 1500 కిలోమీటర్లు ప్రయాణించి వస్తాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఇక్కడ సరస్సులు, చెరువులు, కుంటలు, జలాశయాలు, వరి పొలాల గట్ల వద్ద పిల్లలను చేసి మళ్లీ తిరుగుపయనం అవుతాయి. చూడడానికి గోధుమ రంగుతోపాడవైన మెడ కలిగి ఉండి, విశాలమైన రెక్కలతో కనువిందు చేస్తాయి.*

*- దస్తురాబాద్, మార్చి 9*

# ఘోర రోడ్డు ప్రమాదం

● ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు మృతి ● పది మందికి తీవ్ర గాయాలు ● రాంగ్‌రూట్‌లో అగిఉన్న ఐచర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

ఎదులాపురం, మార్చి 9 : ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో పది మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో ఎన్‌హెచ్-44పై రాంగ్‌రూట్‌లో ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రదీప్ సాహు(35), జబల్పూర్‌కు చెందిన లోచన్‌కుమార్(32)లు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో 30 ప్రయాణికులు ఉండగా.. ఇందులో పది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే వీరిని 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ గౌష్ ఆలం ప్రమాద స్థలాన్ని పరిశీలించి కారణాలను తెలుసుకున్నారు. గాయపడిన మిగితా ఎనిమిది మంది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్‌కు చెందిన వారు. ఇందులో షాను, ముకేష్ సాహు, సునీత సాహు, మనస్వీ, అనిత, ప్రజ్ఞాన, కమలేష్ పాల్, ప్రదీప్‌కుమార్ జస్వాల్ ఉన్నారు. మృతిచెందిన వారి కుటుంబసభ్యులకు పోలీసులు సమచారం అందించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరిచారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐలు ఫణిదర్, సాయినాథ్, ఎంటీవోటీ మురళి, ఎస్సై సయ్యద్ ముజాహిద్ ఉన్నారు.రాంగ్‌రూట్‌లో ఐచర్ వాహనాన్ని ఆపినందుకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. ప్రస్తుతం ఐచర్ వాహన డ్రైవర్, క్లినర్ పరారీలో ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

## ఎస్పీ గౌష్ ఆలంకు వీడ్కోలు

**గజమాలతో సత్కరించి, వాహనాన్ని లాగిన పోలీసులు**

ఎదులాపురం, మార్చి 9 : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న గౌష్ ఆలంకు పోలీసులు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విదాయి పరేడ్ నిర్వహించారు. గౌరవ వందనం సమర్పించి గజమాలతో సత్కరించారు. ఎస్పీని ప్రత్యేక వాహనంలో ఎక్కించి హెడ్ క్వార్టర్స్ గేట్ వరకు వాహనానికి తాడు కట్టి లాగుతూ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 14 నెలలపాటు చేసిన సేవలు జిల్లా పోలీసులతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసు సిబ్బందికి, డీపీవో సిబ్బందికి, పోలీసు అధికారులకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. విపత్తులు, ఆపత్కాల సమయంలో జిల్లా స్థాయిలో మొదటిసారిగా 20 మంది పోలీసు సిబ్బందితో డిజాస్టర్ రెస్పాన్స్‌ను స్థాపించి తనదైన ముద్రను ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించామన్నారు. డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, నాగేందర్, హసీబుల్ల పాల్గొన్నారు.



ఎస్పీ ఉన్న ప్రత్యేక వాహన తాడును లాగుతున్న పోలీసులు

## నేడు ప్రజావాణి బహిరంగ విచారణ

ఎదులాపురం, మార్చి 9 : పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణలో భాగంగా సోమవారం సిరికొండ, ఇచ్చోడ మండలాల్లో నిర్వహిస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఏర్పాట్లపై ప్రజావాణి బహిరంగ విచారణ, ఎల్‌ఆర్‌ఎస్, యూడీఐడీ, ఇంటర్ పరీక్షలు, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు వంటి పలు అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బహిరంగ విచారణ జరిపే చోట మౌలిక వసతులు కల్పించాలని.. షామియానా, టెంట్, టేబుల్స్, కౌంటర్, తాగునీరు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని త్వరగా పైలెట్ ప్రజావాణి బహిరంగ విచారణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. ప్రజావాణి- పైలట్ క్యాటగిరిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఎస్ఈఆర్‌పీ) ఆహార, పౌర సరఫరాల శాఖ పింఛన్‌లు, జాతీయ కుటుంబ ప్రయోజన రేషన్ కార్డు, గ్యాస్ సబ్సిడీ, గృహనిర్మాణ శాఖ, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, పంట రుణమాఫీ, రైతు బీమా, వ్యక్తిగత అటవీ హక్కులు, గృహజ్యోతి, విద్యుత్ సేవా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## మార్చిలోనూ మంచు..

దస్తురాబాద్,మార్చి 9 : మార్చి నెలలో ఓ వైపు పగడి పూట ఎండలు మండుతున్నప్పటికీ రాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ వాతావరణంలో భిన్న మార్పులు కనిపిస్తున్నాయి. ఆదివారం మండలాన్ని పొగ మంచు కమ్మేసింది. వేసవి కాలంలోను శీతాకాలన్ని తలిపించింది. వేసవి కాలం సమీపిస్తున్న డిసెంబర్, జనవరి నెలల వలే ఉదయం, రాత్రి వేళలో చలి వణికిస్తుంది. పగటి పూట మాత్రం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఇలా వాతావరణం మార్పుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పచ్చని పొలాల్లో మంచు కమ్ముకోవడంతో శీతాకాలాన్ని తలపించింది.



దస్తురాబాద్‌లో కమ్మేసిన పొగ మంచు